
సాక్షి ఒడిశా

శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3.81.968లు. బంగారం 20 మిల్లీగ్రాములు. వెండి 36 గ్రాములు 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పల్లెశ్రీ మేళా.. వ్యాపారం భళా

జాతీయ ఆదివాసీ మహోత్సవం కొరాపుట్ పర్వ్ సందర్భంగా నిర్వహించిన పల్లెశ్రీ మేళాలో దాదాపు రూ.10 కోట్లకు పైగా వ్యాపారం జరిగిందని అధికారులు వెల్లడించారు.

- 8లో



ప్లస్-2 విద్యార్థులకు జేఈఈ కోచింగ్

రాష్ట్రంలో వివిధ ఉన్నత పాఠశాలల్లోని 11, 12వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో నీట్, జేఈఈ కోచింగ్‌లను ఉచితంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

- 8లో

న్యూస్‌రీల్

35 కిలోల గంజాయి స్వాధీనం



ఆటోతో పాటు అరెస్టైన వ్యక్తులు

బరంపురం: నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 35 కిలోల గంజాయిని బీఎస్‌పూర్ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి హెచ్‌సీ సమంత్ తెలిపిన వివరాల మేరకు.. గజపతి జిల్లా మోహనా అటవీ ప్రాంతం నుంచి బరంపురం నగరానికి ఆటోలో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో బీఎస్‌పూర్ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు 16వ నంబర్ జాతీయ రహదారి లంజిపల్లి బైపాస్ జంక్షన్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానంతో ఆటోలో సోదాలు చేయగా 35 కిలోల గంజాయి బస్తా బయటపడింది. దీంతో ఆటోతో పాటు డ్రైవర్, తరలిస్తున్న మరో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాం సుమారు రూ.7 లక్షలు ఖరీదు చేస్తుందని వెల్లడించారు.

బాణాసంచా గోదాంపై దాడులు



అరెస్టైన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు



అక్రమంగా నిల్వ ఉంచిన బాణాసంచా

బరంపురం: గంజాం జిల్లా పత్రపూర్ బ్లాక్‌లో అక్రమంగా బాణాసంచా నిల్వ ఉంచిన గోదాముపై పోలీసులు దాడులు నిర్వహించి, రూ.10 లక్షల విలువ చేసే బాణాసంచా సీజ్ చేసిన ఘటన జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించింది. గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీనా తెలిపిన వివరాల మేరకు.. పత్రపూర్ బ్లాక్ జరడా పోలీసుస్టేషన్ పరిధి డెంగాపధా గ్రామంలోని గోదాములో ఎటువంటి లైసెన్స్ లేకుండా అక్రమంగా బాణాసంచా నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. అలాగే ఒకరిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి డెంగాపధా గ్రామానికి చెందిన సురేంద్ర నాయక్‌గా గుర్తించారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే ముదులి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముదులి

రాయగడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి సూచించారు. స్థానిక రాయగడ అటానమస్ కళాశాలలో గురువారం జరిగిన యువ ఒడిశా నవీన్ ఒడిశా అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ పథకాలకు సంబంధించి విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం యువ ఒడిశా నవీన్ ఒడిశా పేరిట ఇటువంటి తరహా కార్యక్రమాలను రాష్ట్రమంతటా నిర్వహిస్తోందని తెలియజేశారు. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని తెలియజేశారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాబిలత షరప్, అధ్యాపకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైన్ టాయిలెట్‌లో యువకుడి మృతదేహం

భువనేశ్వర్: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆగివున్న రాజారాణి ఎక్స్‌ప్రెస్ రైలు టాయిలెట్‌లో గుర్తు తెలియని యువకుడి మృతదేహం బుధవారం అర్ధరాత్రి కనుగొన్నారు. మృతుని వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నారు. గావంచాతో (టవల్) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. దీంతో అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ) శవ పరీక్షకు పంపించారు.





• హిమ సోయగం..!

పొగమంచు అందాలు కొందమాల్ జిల్లాలో కనువిందు చేస్తున్నాయి. తెల్లవారుజామున హిమ సోయగం పర్యాటకులను ఆకర్షిస్తోంది. ముఖ్యంగా దరింగబడిలో కొండలపై కమ్ముకున్న మంచు హిమాలయాలను తలపిస్తోంది. రోడ్లపై ఏర్పడిన మంచు తెరతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నా.. ఆహ్లాదకరమైన వాతావరణం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తోంది. మంచు దుప్పటి చీల్చుకుంటూ వస్తున్న భానుడి అందాలు మైమరిపిస్తున్నాయి.

- బరంపురం

అగ్ని ప్రమాదాల్లో వరిపంట దగ్ధం



ఖెందుగుడ గ్రామంలో దగ్ధమవుతున్న వరి కుప్పలు

జయపురం: బొరిగుమ్మ సమితిలోని రెండు ప్రాంతాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో సుమారు 25 ఎకరాల్లో పండిన ధాన్యం కుప్పలు కాలి బూడిదైనట్లు సమాచారం. బొరిగుమ్మ సమితి అవులి పంచాయతీ ఖెందుగుడ గ్రామంలోని ఒక కల్లంలో వేసిన 5 ఎకరాల పంట అగ్నికి ఆహుతైంది. ప్రమాదం జరిగిన వెంటనే మంటలు ఆర్పేందుకు రైతులు ప్రయత్నించినా ఫలితం లేకపోవటంతో వెంటనే వారు బొరిగుమ్మ అగ్నిమాపక విభాగానికి తెలియజేశారు. అగ్నిమాపక వాహనం మంటలను అదుపు చేసేసరికి 90 శాతం కుప్పలు కాలిపోయాయి. అలాగే బొరిగుమ్మ సమితి కాటరగడ గ్రామంలో కుప్పలు వేసిన 20 ఎకరాల వరిపంట అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యింది. ఆ ధాన్యం కుప్పలు ఏడుగురు రైతులవని తెలిసింది. సమాచారం అందిన వెంటనే బొరిగుమ్మ తహసీల్దార్ సవ్యసాచి జెన, కాటరగడ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో వెళ్లి నష్టాన్ని పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించడం జరుగుతుందని బాధితులకు తెలిపారు. అయితే ప్రమాదాలకు కారణాలు తెలియలేదు.



కాటరగుడ గ్రామంలో కాలి బూడిదైన పంట

ఏడీసీగా మనీషా పాడి

- దేశంలోనే తొలి మహిళగా గుర్తింపు



గవర్నర్ హరిబాబుకు సెల్యూట్ చేస్తున్న ఏడీసీ మనీషా పాడి

భువనేశ్వర్: ఒడిశాకు చెందిన భారత వైమానిక దళం (ఐఏఎఫ్) అధికారి మనీషా పాడి దేశంలోనే తొలి మహిళా ఎయిడ్ – డే – క్యాంప్ (ఏడీసీ)గా అరుదైన ఘనత సాధించింది. స్క్వాడ్రన్ లీడర్ మనీషా పాడి 2015–బ్యాచ్ భారత వైమానిక దళం అధికారి. బుధవారం మిజోరం గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి భారత సాయుధ దళాల నుంచి తొలి మహిళా ఏడీసీగా మనీషా పాడిని నియమించారు. ఆమె నియామకం ఒక మైలురాయి మాత్రమే కాదు, లింగ నిబంధనలను ఉల్లంఘించి వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల శక్తికి నిదర్శనమన్నారు. ఈ అద్భుతమైన విజయాన్ని పురస్కరించుకుని ప్రతి రంగంలో మహిళా సాధికారతను సాధించడాన్ని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. అధికారికంగా ఈ పదవిలో చేరిన మనీషా పాడి మిజోరాం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. గతంలో ఆమె బీదర్, పూణే, భటిండా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్లలో పని చేశారు. ఒడిశా గంజాం జిల్లా బరంపురంలో జన్మించిన మనీషా పాడి భువనేశ్వర్ సీవీ రామన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థి. ఆమె తల్లిదండ్రులు భువనేశ్వర్‌లో ఉంటున్నారు.

• నినదిద్దాం.. నివారిద్దాం



సామూహిక ఉద్యమ స్ఫూర్తితో ఎయిడ్స్ మహమ్మారిని నివారిద్దామని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు అవుదామని అంతర్జాతీయ సైకత యానిమేటర్ మానస కుమార్ సాహు పిలుపునిచ్చారు. పూరీ లైట్ హౌస్ సాగర తీరంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లెట్ కమ్యునిటీస్ లీడ్ నినాదంతో సువిశాల 15 అడుగుల వెడల్పుతో సైకత శిల్పం ఆవిష్కరించాడు. సాగర తీరంలో సందర్శకులు, పర్యాటకులను ఈ శిల్పం విశేషంగా ఆకట్టుకుంటుంది.

- భువనేశ్వర్/పూరీ

రాష్ట్రంలో నల్ల చిరుత జాడ



కెమెరాలకు చిక్కిన నల్ల చిరుత

భువనేశ్వర్: వన్య ప్రాణుల ప్రేమికులకు తీపి కబురు. రాష్ట్రంలో ఓ అడవిలో నల్ల చిరుత పులి మళ్లీ తారసపడింది. ఈ విషయాన్ని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) సుశాంత నంద గురువారం తెలియజేశారు. బ్లాక్ పాంథర్ లేదా మెలనిస్టిక్ (నల్ల) చిరుతపులి గురించి ఖచ్చితమైన ప్రదేశం, ఇతర వివరాలు ఇంకా తెలియాల్సి ఉండగా, రాష్ట్రంలో కొనసాగుతున్న కెమెరా ట్రాప్ టైగర్ సెన్సస్‌లో 2 నల్ల చిరుత పులులు కనుగొన్నట్లు పేర్కొన్నారు. 2018 సంవత్సరంలో తొలిసారిగా రాష్ట్రంలో సుందర్‌గఢ్ అడవుల్లో నల్ల చిరుత పులి కనిపించింది. సుందర్‌గఢ్ అటవీ డివిజన్ పరిధిలోని హేమగిరి పరిధి గర్జన్ పహాడ్ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఇది కనిపించింది. అడవిలో అమర్చిన కెమెరాల్లో తాజాగా బ్లాక్ పాంథర్ (నల్ల చిరుత), దాని పిల్ల పుటేజీ బంధించబడింది.

అంతర్జాతీయంగా పోటీపడాలి



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాల విద్యా ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా ఉండాలని గవర్నర్ రఘుబర్ దాస్ అన్నారు. స్థానిక రాజ్‌భవన్‌లో ఆయన అధ్యక్షతన గురువారం జరిగిన వైస్ ఛాన్సలర్ల సమావేశంలో మాట్లాడారు. క్యాంపస్‌లలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, సిబ్బంది సంఖ్యను పెంచడంపై దృష్టి సారించాలన్నారు. జాతీయ విద్యా విధానం 2023ని విజయవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానంతరం స్థానిక ఉత్కళ వర్సిటీ వైస్ ఛాన్సలర్ సబితా ఆచార్య మీడియాతో మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల్లో పరిశోధనలు, ఆవిష్కరణలపై గవర్నర్ దృష్టి సారించారన్నారు. ఒడిశా సంస్కృతులు, సంప్రదాయాలపై మరిన్ని విలువ ఆధారిత కోర్సులపై లోతుగా చర్చించారని తెలిపారు. ఫకీర్ మోహన్ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ సంతోష్ కుమార్ త్రిపాఠి మాట్లాడుతూ వర్సిటీల్లో రోజువారీ లావాదేవీలు ఈ–ఆఫీస్ ద్వారా నిర్వహించాలని, సకాలంలో పరీక్షలు నిర్వహించి ఫలితాలను ప్రచురించాలని సూచించినట్లు వెల్లడించారు.

కొందమాల్ వైపు పెద్దపులి



గుడారిలో పులి పాదముద్ర



కందమాల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అటవీ సిబ్బంది

- 40 మంది అటవీ శాఖ సిబ్బంది గాలింపు
- 7 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు

రాయగడ: కొద్ది రోజులుగా గజపతి, రాయగడ జిల్లాలను వణికిస్తున్న పెద్దపులి తాజాగా కొందమాల్ జిల్లావైపు అడుగులు వేస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో పులి ఆచూకీ కోసం గజపతి, రాయగడ జిల్లాలకు చెందిన 40 మంది అటవీ శాఖ సిబ్బంది తీవ్రంగా గాలిస్తున్నారు. కాగా ఈ రెండు జిల్లాల్లోని అడవుల్లో 7 ప్రాంతాల్లో సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. ఇటు అధికారులకు, అటు జనాలకు భయభ్రాంతులకు గురిచేస్తున్న పులి అడుగుజాడలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎప్పుడు ఎక్కడ ఎటువంటి ప్రమాదం జరుగుతుందోననే కోణంలో గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఇదిలాఉండగా జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్‌లో అడుగుపెట్టిన పులి సోమవారం రాత్రి సరిహద్దు దాటినట్లు సమాచారం. పద్మపురం సమితి లికిటి పదర్ మీదుగా బుధవారం గుడారి సమితి సిరిగుడ సమీప గెడ్డతీరం వైపు దాటిందని అధికారులు చెబుతున్నారు. అనంతరం అక్కడ నుంచి మునిగుడ సమితుల్లోకి ప్రవేశించినట్లు పాదముద్రలు బట్టి అధికారులు అనుమానిస్తున్నారు. గుడారి అటవీ శాఖ రేంజర్ దిలీప్ పట్నాయక్ మాట్లాడుతూ పులి పాద ముద్రలను పరీక్షల కోసం పంపించామని వెల్లడించారు.

పాదముద్రల పరిశీలన

గజపతి, రాయగడ జిల్లాల్లో సంచరించిన పులి పాద ముద్రలు ప్రస్తుతం పొరుగు జిల్లా కందమాల్ వైపు పడినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో కందమాల్ అడవుల్లో సిబ్బంది పులి అడుగులు, దాని గుర్తులను పరిశీలిస్తున్నారు. మునిగుడ సమితి డొంగొసారొడ, బెలామ్‌గుడ, కర్లాఘటి, మీనాఝొల ప్రాంతాల మీదుగా కందమాల్ జిల్లాకు చెందిన కొటాగడ్ అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్న తెలుస్తోందని మునిగుడ అటవీ శాఖ రేంజర్ అనిల్ పట్నాయక్ తెలియజేశారు.

12 మంది చిన్నారులకు అస్వస్థత

- అడవిలో పండ్లు తినడంతో వాంతులు
- నిలకడగా చిన్నారుల ఆరోగ్యం



చిన్నారులు తిన్న పండ్లను చూపిస్తున్న తండ్రి



ఆందోళన వ్యక్తం చేస్తున్న ఒక చిన్నారి తల్లి



చికిత్స పొందుతున్న చిన్నారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి జోరాపల్లి పంచాయతీ తేలిగూడ గ్రామంలో గురువారం 12 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. ఉదయం పూట పిల్లలు ఆడుకుంటూ సమీప అడవిలో దొరికిన పండ్లను తిన్నారు. దీంతో కొంత సేపటికి వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. చిన్నారులను ఏం తిన్నారని తల్లిదండ్రులు ప్రశ్నించగా పండ్లని చెప్పడంతో వెంటనే పద్మగిరి ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందించారు. అనంతరం అక్కడ నుంచి మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి పిల్లలకు వైద్యం అందజేస్తున్నారు. అయితే విషతుల్యమైన పండ్లను తినడం వలనే అస్వస్థతకు గురయ్యారని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం చిన్నారుల ఆరోగ్యం నిలకడగానే ఉందని వెల్లడించారు.

యువత రాజకీయాల్లో రాణించాలి



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

రాయగడ: రాజకీయాల్లో యువత రాణించాలని బిజూ ఛత్రో, యువ జనతాదళ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ప్రణవ్ బలవంతరాయ్ పిలుపునిచ్చారు. స్థానిక బిజూ పట్నాయక్ అడిటోరియంలో గురువారం నిర్వహించిన మూఖి హెబి నవీన్ ఒడిశారో సాథి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకెళ్తోందని తెలియజేశారు. అన్ని వర్గాల ప్రజలకు పక్కాగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. బిజూ కుటుంబంలోని ప్రతీ కార్యకర్త పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత రాజకీయాల్లో రాణించగలిగితే ప్రజలు మరిన్ని సేవలు పొందగలరని అభిప్రాయపడ్డారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో యువతపై కార్యకర్తలు దృష్టి సారించి, అవగాహన కల్పించాలని సూచించారు. బిజూ యువ జనతాదళ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు భీమసేన్ రాయ్ మాట్లాడుతూ బీజేడీపై యువతకు మంచి అభిప్రాయం ఉందన్నారు. యువత ఉన్నత విద్యాభ్యాసానికి చేయూతనందిస్తున్న పథకాల గురించి వారికి అవగాహన కలిగేలా సమావేశాలు, అవగాహన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. కొత్తగా ఓటుహక్కు కలిగిన యువతకు ఎన్నికల తీరుపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, ఎస్డీసీ చైర్మన్ అనసూయా మాఝి, ఛత్రో బీజేడీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దేవి రంజన్ త్రిపాఠి, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



క్లబ్ అధ్యక్షుడు సురేష్‌తో సభ్యులు

రాయగడ: స్థానిక సాయిప్రియ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని క్లబ్ ప్రాంగణంలో గురువారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ ఎం.సురేష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా లాడి చంద్రమౌళి, కార్యదర్శిగా కె.సూర్యనారాయణ, సహ కార్యదర్శిగా వాసుదేవ్, కోశాధికారిగా టి.నాగేశ్వర రావులు నియమితులయ్యారు. క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ సురేష్ రెండోసారి ఎన్నికవ్వడంతో పలువురు ఆయనను అభినందించారు.

పాఠశాలకు ఆర్వో ప్లాంట్ వితరణ



వితరణగా అందజేసిన ఆర్వో ప్లాంట్

పర్లాకిమిడి: స్థానిక మహారాజా బాలికల ఉన్నత పాఠశాలకు పట్టణానికి చెందిన వైద్యుడు డాక్టర్ ఆర్.ఆర్.రవి వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆర్వో ప్లాంట్‌ను గురువారం వితరణగా అందజేశారు. విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.ఉషారాణి, ఎం.ఆర్.గరల్స్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధాన ఉపాధ్యాయుడు ప్రశాంత కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సాల్వెన్సు సర్టిఫికెట్ తయారీదారులకు జైలు శిక్ష

శ్రీకాకుళం పాతబస్టాండు : కోర్టును మోసగిస్తూ ఒక రెవెన్యూ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు సాల్వెన్సు సర్టిఫికెట్ తయారుచేసి కోర్టును మోసగించినందుకు గాను ముద్దాయిలు ఓరుగంటి ఈశ్వరరావు, ఆయనకు షూరిటీ ఇచ్చిన పల్లె రాంబాబు, వర్రి అప్పలరాజులకు రెండేళ్ల పాటు జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ. 1500 చొప్పున జరిమానా విధించారు. అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి కె.రాణి ఈ తీర్పునిచ్చారు. ఈ కేసులో దర్యాప్తు అధికారిగా సీఐ దాడి మోహనరావు, ప్రభుత్వ న్యాయవాదిగా కె.సుశీల వ్యవహరించారు.

చిట్‌ఫండ్ కిలాడీపై కేసు

టెక్కలి రూరల్: చిట్స్ పేరుతో దాచుకున్న డబ్బులను ఒకామె మోసం చేసి తీసుకుపోయిందని టెక్కలి పోలీసులకు పలువురు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి రోటరీనగర్-1కు చెందిన రఘుపాత్రుని సబితదేవి, ఆమె భర్త ప్రసాద్ కొంతకాలంగా చిట్‌ఫండ్స్, వడ్డీల వ్యాపారం చేస్తున్నారు. రోటరీనగర్, అయ్యప్పనగర్ తదితర ప్రాంతాలకు చెందిన ఉద్యోగులతో సన్నిహితంగా ఉండి వారితో చిట్‌ఫండ్స్ కట్టించేవారు. అయితే వారం కిందట తాను ఉంటున్న ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయిందని, ఆమె పిల్లలు ఇక్కడే ఉన్నా వారిద్దరి ఆచూకీ కనిపించడం లేదని బాధితులు పోలీసుల వద్ద తెలిపారు. ఆమె వద్ద తమ సొమ్ము రూ.3 కోట్ల వరకు ఉంటుందని దాదాపు 30 మంది బాధితులు ఎస్ఐ రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ కేసును మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసు సిబ్బందికి నగదు రహిత వైద్యం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో ఉన్న పోలీసు సిబ్బందికి నగదు రహిత వైద్యం అందించేలా అడుగు ముందుకు పడింది. జిల్లాకేంద్రంలో ఉన్న మెడికవర్ ఆస్పత్రిలో పోలీసు ఆరోగ్య భద్రత స్కీమ్ పథకం అందుబాటులోకి వచ్చిందని, ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ఈ పథకం అమల్లోకి రావడం ఇదే ప్రథమం అని ఎస్పీ జీఆర్ రాధిక పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో వైద్య శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. మెడికవర్ ఆస్పత్రి హెడ్ డాక్టర్ శ్రీధర్ పోలీసు సిబ్బందికి అనేక విధాలుగా సహాయపడుతున్నారని, అందులో భాగంగానే ఈ పథకం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇకపై మేజరు చికిత్సలన్నీ అందుబాటులో ఉన్నాయని అత్యవసర పరిస్థితుల్లో ఇతర జిల్లాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన అవసరం ఇకపై ఉండదన్నారు. నేత్ర వైద్యం, క్యాన్సర్, ప్లాస్టిక్ సర్జరీ, బర్న్స్ వంటివి మినహా అన్ని రకాల వైద్య సదుపాయాలు ఉంటాయన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఇక ప్రతిరోజూ ప్రతి పోలీస్‌స్టేషన్ నుంచి ఇద్దరు చొప్పున 50 మందికి వైద్య పరీక్షలు చేయించడం జరుగుతుందన్నారు.

ప్లస్-2 విద్యార్థులకు జేఈఈ కోచింగ్



భువనేశ్వర్: రాష్ట్రంలో వివిధ ఉన్నత పాఠశాలల్లోని 11, 12వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో నీట్, జేఈఈ కోచింగ్‌లను ఉచితంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉన్నత విద్యా విభాగం డైరెక్టర్ రఘురామ్ ఆర్.అయ్యర్ అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర ఎయిడెడ్ ప్లస్-2 కళాశాల ప్రిన్సిపాల్స్‌కు బుధవారం లేఖ రాశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర ఎయిడెడ్ ఉన్నత మాధ్యమిక విద్య పాఠశాలల్లో చదువుతున్న జాతీయ అర్హత మరియు ప్రవేశ పరీక్ష (నీట్), సంయుక్త ప్రవేశ పరీక్ష (జేఈఈ) అభ్యర్థులకు పోటీ సామర్థ్యం పెంపొందించడం కోసం అనుబంధ ఆన్‌లైన్ కోచింగ్ అందించాలని నిర్ణయించినట్లు రఘురామ్ పేర్కొన్నారు. వర్చువల్ మోడ్‌లో కోచింగ్ అందించబడుతుంది.

అందువలన ఇంటరాక్టివ్ ప్యానెల్‌లు లేదా స్మార్ట్ టీవీలతో కూడిన స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు లేని ఉన్నత మాధ్యమిక విద్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సిస్టమ్‌ను ఇన్‌స్టాల్ చేయాలని కోరారు. ప్రణాళిక, సమన్వయ విభాగం పథకం కింద అత్యధిక ఉన్నత మాధ్యమిక విద్య పాఠశాలలు స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల అభివృద్ధికి సహాయం పొందాయని వెల్లడించారు. ఏదైనా ఉన్నత మాధ్యమిక విద్య పాఠశాల ఈ విషయంలో నిధులు పొందని పక్షంలో, ప్రస్తుత ఆర్థిక శాఖ మార్గదర్శకాల ప్రకారం స్టూడెంట్ అకడమిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సామ్స్) ఖాతా లేదా ఉన్నత మాధ్యమిక విద్య పాఠశాల అభివృద్ధి నిధిలో అందుబాటులో ఉన్న నిధులను ఉపయోగించుకోవడానికి అనుమతించినట్లు స్పష్టం చేశారు.

ఉత్కళ వర్సిటీ నాక్ గ్రేడ్ సవరణ



ఉత్కళ విశ్వ విద్యాలయం

భువనేశ్వర్: నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) అప్పీల్ తర్వాత స్థానిక ఉత్కళ విశ్వ విద్యాలయం గ్రేడ్‌ను ఏ+ కి సవరించింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అధీనంలో నాక్ ఈ మేరకు తాజా ప్రకటన విడుదల చేసింది. ఉత్కళ విశ్వ విద్యాలయం 3.26 తుది సీజీపీఏ గ్రేడ్ పాయింట్ల స్కోరుతో ఏ+ గుర్తింపు సాధించడం విశేషం.

ప్రతిష్టాత్మక ఉత్కళ విశ్వ విద్యాలయం పాఠ్యాంశాల్లో 3.57, బోధన-అభ్యాసన, మూల్యాంకనంలో 3.33, పరిశోధన, ఆవిష్కరణలు, విస్తరణలో 3.15, మౌలిక సదుపాయాలు, అభ్యాస వనరుల్లో 3.65, విద్యార్థుల మద్దతు, పురోగతిలో 3.11, పాలన, నాయకత్వం, నిర్వహణలో 2.62 గ్రేడ్ పాయింట్లు, సంస్థాగత విలువలు, ఉత్తమ అభ్యాసం వర్గంలో 3.37 గ్రేడు పాయింట్లు సాధించింది.

– పునః మూల్యాంకణలో...

ఈ ఏడాది మే నెలలో నాక్ సమీక్షలో 3.16 క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ల స్కోరుతో ఉత్కళ విశ్వ విశ్వ విద్యాలయానికి ఏ గ్రేడ్ కేటాయించారు. విశ్వవిద్యాలయం 2016 సంవత్సరంలో చివరిగా జరిగిన నాక్ మూల్యాంకనంలో ఏ+ సాధించింది. ఈ ప్రేరణతో ఈసారి ఏ++ గ్రేడ్ సాధనకు విశేషంగా కృషి చేసింది. ఈ తరుణంలో గతం కంటే ఈసారి గ్రేడ్ దిగజారడంపై సర్వత్రా విచారం వ్యక్తం అయింది. విద్యావేత్తలు, మేధావులు మరియు విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులలో అసంతృప్తి కట్టలు తెంచుకోవడంతో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ పునః మూల్యాంకణం కోసం నాక్‌ని అభ్యర్థించింది. ఈ నేపథ్యంలో నిర్వహించిన పునఃమూల్యాంకనంలో ఉత్కళ విశ్వ విద్యాలయం ఏ+ నాక్ గ్రేడ్‌ని సాధించుకుంది. ఇంతకు ముందు కటక్ రెవెన్షా విశ్వ విద్యాలయానికి 3.58 పాయింటల్లో నాక్ ఏ++ గ్రేడ్ కేటాయించింది.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి



రైతులకు యంత్రాల సబ్సిడీ పత్రాలు అందజేస్తున్న దృశ్యం



వివిధ యంత్రాల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న తిరుపతిరావు తదితరులు

పర్లాకిమిడి:

రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు అన్నారు. స్థానిక గజపతి స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న జిల్లాస్థాయి వ్యవసాయ యంత్రాలు, పనిముట్ల మేళాలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని కాశీనగర్ ప్రాంతంలో కోల్డు స్టోరేజీ సదుపాయం లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. రైతులు తమ పంట పొలాల మట్టి పరీక్షలు చేయించుకోవడం వలన మేలు జరుగుతుందని సూచించారు. అలాగే వాణిజ్య పంటలతో పాటు కోళ్లు, ఆవుల ఫారంలు, పెరటి తోటలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న యంత్రాలు, పనిముట్లను రైతులు, మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గజపతి జిల్లా నువాగడ సమితిలో వ్యవసాయ యంత్రాల ద్వారా అధిక లాభాలు పొందిన ముగ్గురు రైతులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గుసాని ఆరోజోన్ జెడ్పీటీసీ బాలరాజు, కాశీనగర్ బీజేడీ అధ్యక్షుడు రొక్కం సతీష్, రాష్ట్ర వ్యవసాయ వైజ్ఞానికుడు రవీంద్ర పాయక్‌రాయ్, జిల్లా వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు

బీటెక్ కోర్సు ప్రారంభించాలని వినతి

రాయగడ: స్థానిక ప్రభుత్వ ఉత్కల్ గౌరవ్ మధుసూదన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యార్థుల సౌకర్యార్థం బీటెక్ కోర్సును ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి కోరారు. బుధవారం సాయంత్రం యూజీఎంఐటీ సంస్థ 12వ గవర్నింగ్ బాడీ సమావేశంలో పాల్గొన్న ఆయన కమిటీకి విన్నవించారు. పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న రాయగడలో ఎంతోమంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. అందువలన కోర్సును ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అంగీకరిస్తే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో పాటుగా క్యాంపస్ సెలక్షన్స్ కోసం జిల్లాలోని చిన్న, మధ్య, భారీ పరిశ్రమల యజమానులను ఆహ్వానించాలని కోరారు. సమావేశంలో యూజీఎంఐటీ అధ్యక్షుడు నారాయణ పటేల్, లెక్చరర్లు, పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముదులి తదితరులు



కొరాపుట్ కళాకారులు నృత్య ప్రదర్శన



పల్లెశ్రీ మేళాలో ఆకర్షణీయమైన ఇత్తడి వస్తువుల స్టాల్



నయాగడ చనాపుడ్ స్టాల్ వద్ద కొనుగోలుదారులు

పల్లెశ్రీ మేళా.. వ్యాపారం భళా

జాతీయ ఆదివాసీ మహోత్సవం కొరాపుట్ పర్వ్-2023 సందర్భంగా నిర్వహించిన పల్లెశ్రీ మేళాలో రాష్ట్రంలోని ప్రతీ జిల్లా నుంచి మహిళా స్వయం సహాయక గ్రూపులు, ఇతర రాష్ట్రాల వారితో పలు రకాల సామగ్రిలతో స్టాల్స్ ఏర్పాటు చేశారు. దీంతో దాదాపు రూ.10 కోట్లకు పైగా వ్యాపారం జరిగిందని అధికారులు వెల్లడించారు. పల్లెశ్రీ మేళ నాలుగో రోజు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల కోసం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా సంస్కృతి పరిషత్ అధికారి ప్రతిశుద్ధ జెన, జిల్లా సమాచార, ప్రజా సంబంధాల అధికారి స్వరాజ్య శీశా తదితరులు పాల్గొన్నారు. – జయపురం

ఆ బంగారం ఎక్కడ..



- జిల్లాలో సంచలనమైన గార ఎస్‌బీఐ బంగారు ఆభరణాల మాయం
- రూ. 4కోట్లకు పైగా విలువైన 7కిలోల బంగారం అదృశ్యంపై విచారణ
- ఎస్‌బీఐ అధికారుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు
- గోల్డ్ మిస్సింగ్ కేసులో కీలకమైన వ్యక్తి చనిపోవడంతో సంక్లిష్టత

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

గార ఎస్‌బీఐలో ఖాతాదారులు కుదవ పెట్టిన బంగారు ఆభరణాలు మాయం కావడం జిల్లాలో సంచలనం సృష్టిస్తోంది. రూ.4కోట్ల 7లక్షల విలువైన 7కిలోల బంగారం కనబడకపోవడం కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్నట్లు చెబుతున్న ఒక మహిళా ఉద్యోగి ఇప్పటికే ఆత్మహత్య చేసుకుని చనిపోవడంతో కేసు మరింత సంక్లిష్టంగా మారింది. ఇప్పుడీ వ్యవహారం బ్యాంకు వర్గాలను కుదిపేస్తోంది. బంగారు ఆభరణాలు గల్లంతుపై పోలీసులకు లిఖిత పూర్వక ఫిర్యాదు కూడా అందడంతో ఇందులో ఎవరి ప్రమేయం ఏమిటో తేల్చే పనిలో పోలీసు యంత్రాంగం నిమగ్నమైంది. ఇప్పటికే ఫిర్యాదులో నలుగురిని స్పష్టంగా పేర్కొన్నారు. వీరితో పాటు బ్యాంకు అధికారులు, బయట వ్యక్తుల జోక్యంపైనా అనుమానాలుండటంతో పోలీసు వర్గాలు ఆరాతీస్తున్నాయి. ఈ బాగోతం ఎస్‌బీఐ బ్రాంచ్‌లో చోటు చేసుకున్నా జిల్లాలో అన్ని బ్యాంకులు అప్రమత్తమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటివి ఇంకెక్కడైనా జరిగి ఉండొచ్చేమోనని బ్యాంకు వర్గాలు జాగ్రత్త పడుతున్నాయి.

నమ్మకాన్ని వమ్ము చేసి..

బయట వ్యక్తుల వద్ద బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి సొమ్ము తీసుకోవడం శ్రేయస్కరం కాదని చాలా మంది బ్యాంకుల్లో తమ ఆభరణాలను కుదవ పెట్టి సొమ్ము తీసుకుంటారు. ఆ నమ్మకాన్ని గార ఎస్‌బీఐలో పనిచేసిన కొంతమంది ఉద్యోగులు వమ్ము చేశారు. సూత్రధారులు, పాత్రధారులెవరో విచారణలో తేలనున్నప్పటికీ రూ.4కోట్లకు పైగా విలువైన 7కిలోల బంగారాన్ని మాయం చేశారంటే చిన్న విషయం కాదు. ఇప్పుడా ఖాతాదారులంతా గగ్గోలు పెడుతున్నారు.

పర్యవేక్షణ డొల్ల..

సాధారణంగా బ్యాంకులో గోల్డ్ లోన్ విభాగం ప్రత్యేకంగా ఉంటుంది. దానికొక అసిస్టెంట్ మేనేజర్ హోదాలో ఉన్న అకౌంటెంట్ ఉంటారు. క్లర్క్ లేదా అప్రైజర్ ఉంటారు. వీరిద్దరు ఖాతాదారుల నుంచి తాకట్టు బంగారాన్ని తీసుకుంటారు. వీరితో పాటు ఇద్దరు కస్టోడియన్‌లు ఉంటారు. వీరిద్దరి వద్ద స్ట్రాంగ్ రూమ్, సేఫ్ (లాకర్లు)కు సంబంధించిన వేర్వేరు తాళాలు ఉంటాయి. అకౌంటెంట్, క్లర్క్ తీసుకున్న బంగారాన్ని కస్టోడియన్‌లతో కలిపి సేఫ్‌లలో భద్రపరుస్తారు. ఆ ఇద్దరు కస్టోడియన్‌ల వద్ద ఉన్న వేర్వేరు తాళాలను ఉపయోగిస్తే తప్ప భద్రపరచడం గాని, తీయడం గానీ జరగదు. ఇంతటి పకడ్బందీ వ్యవహారం ఉండే బ్రాంచ్‌లలో దాదాపు 7కిలోల బంగారం పక్కదారి పట్టిందంటే ఇందులో చాలామంది ప్రమేయం ఉండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి బ్రాంచ్‌లో ఏం జరిగినా సంబంధిత మేనేజర్ బాధ్యత ఉంటుంది. దానితో పాటు ఉన్నతాధికారుల పరిశీలన ఉంటుంది. ఎన్నో సేఫ్‌లలో ఉన్న బంగారం పెద్ద ఎత్తున మాయమవ్వడంతో బ్రాంచ్ పర్యవేక్షణ డొల్లతనం బయటపడింది.

ఎలా బయటకు వచ్చింది..



గార బ్రాంచిలో బంగారం ఆభరణాలు కుదవ పెట్టిన ఖాతాల బ్యాగులు 2500 వరకు ఉన్నట్టు సమాచారం. అందులో 86 బ్యాగులలో ఉన్న బంగారు ఆభరణాలు మాయమమ్యాయి. ఓ ఖాతాదారు బ్యాంకుకు తనఖా పెట్టిన బంగారం విడిపించేందుకు వెళ్లగా బంగారం కనబడటం లేదని సమాధానం రావడంతో వ్యవహారం బయటికొచ్చింది. దాంతో అదే రోజు సాయంత్రం మరికొందరు ఖాతాదారులు బ్యాంకు వద్దకు చేరి విషయమై మేనేజరు సీహెచ్ రాధాకృష్ణ వద్ద అడుగగా రెండు రోజుల్లో చెబుతామని నచ్చ చెప్పి వెనక్కి పంపించారు. ఈ నేపథ్యంలో ఆ బంగారు ఆభరణాల రుణాల విభాగం బాధ్యతలు చేపడుతున్న అకౌంటెంట్ స్వప్నప్రియను గట్టిగా ప్రశ్నించేసరికి 26బ్యాగులలో ఉన్న రూ. కోటి 75లక్షల బంగారు ఆభరణాలను తెచ్చి ఇచ్చారు. మిగతా 60బ్యాగుల బంగారు ఆభరణాలపై క్లారిటీ ఇవ్వలేదు. ఇంతలో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. విశాఖలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనతో బంగారు ఆభరణాలు గల్లంతు వ్యవహారం మిస్టరీగా మారిపోయింది. అంతవరకు వ్యవహారాన్ని గుట్టుగా ఉంచిన అధికారులు తప్పని పరిస్థితుల్లో గార పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పుడా కనిపించని 60బ్యాగుల్లో రూ.4కోట్ల 7లక్షల విలువైన 7కిలోల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఇవి ఎవరి చేతుల్లోకి వెళ్లాయి. ప్రస్తుతం ఎవరి వద్ద ఉన్నాయి. కీలకమైన వ్యక్తి చనిపోవడంతో దీంట్లో ఉన్న పాత్రధారులెవరో తేలాల్సి ఉంది. ఇంతవరకు అంతర్గతంగా తేల్చుకుందామని భావించినా పరిస్థితి చేయి దాటిపోవడంతో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ గార పోలీసులకు ఫిర్యాదు చేశారు. నలుగురిపై ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరితో పాటు మరికొంతమంది కూడా ఉన్నట్టు అనుమానాలు ఉన్నాయి. ఈ కోణంలో పోలీసు అధికారులు విచారణ మొదలు పెట్టారు. ఇదిలా ఉండగా, 86బ్యాగుల వ్యవహారం వెలుగు చూడటంతో ఆ బ్రాంచ్‌లో ఉన్న మిగతా తాకట్టు ఆభరణాల బ్యాగులలో ఏవైనా తేడాలున్నాయా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. వాటిపైన కూడా దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. గారలో జరిగిన ఘటనతో మిగతా ఎస్‌బీఐ బ్రాంచ్‌లలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఇతర బ్యాంకులు కూడా అప్రమత్తమైనట్టు తెలుస్తోంది. తమ బ్యాంకుల్లో ఉన్న బంగారు ఆభరణాల భద్రతపై ఆరా తీస్తున్నట్టు సమాచారం.

స్టేట్‌బ్యాంకులో 7 కేజీల బంగారం మాయం

- నలుగురు బ్యాంకు సిబ్బందిపై ఫిర్యాదు చేసిన బ్యాంకు ఆర్ఎం రాజు



గార స్టేట్‌బ్యాంకు

గార: మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంకులో 7 కిలోల బంగారం మాయమైందని ఫిర్యాదు వచ్చిందని స్థానిక సీఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు. ఖాతాదారులు బ్యాంకులో తనఖా పెట్టిన బంగారంలో ఏడు కిలోలు కనిపించడం లేదని, కొందరు బ్యాంకు సిబ్బందిపై అనుమానం ఉందని గురువారం బ్యాంకు రీజినల్ మేనేజర్ రాజు ఫిర్యాదు చేశారని సీఐ పేర్కొన్నారు. బంగారం విలువ రూ. 4 కోట్ల 70 లక్షల పైనే ఉంటుందని తెలిపారు. అదేవిధంగా బ్యాంకు అకౌంటెంట్ ఉరిటి స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని, బంగారం మాయంపై ఆమె పాత్రపై కూడా విచారణ చేస్తామన్నారు. దీనిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. గురువారం ఉదయం నుంచి గార పోలీస్‌స్టేషన్‌లో ఈ కేసు విషయమై ఇన్‌చార్జి డీఎస్పీ విజయకుమార్, శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ ఎస్.సన్యాసినాయుడు, బ్యాంకు ఆర్ఎం రాజు, గార బ్రాంచి మేనేజర్ సీహెచ్ రాధాకృష్ణతో మాట్లాడారు.

సీసీ పుటేజీలే కీలకం..

బ్యాంకులో ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారం మాయమయ్యే సమయంలో లాక్‌రూంలో ఉన్న సీసీ పుటేజీలే ఈ కేసు దర్యాప్తులో కీలకం కానున్నాయి. ఇప్పటికే బ్యాంకు అధికారులు ఈ పుటేజీలు గమనించారని తెలుస్తోంది. బ్యాంకులో 2500 మంది బంగారం తనఖా పెట్టిన ఖాతాదారులుండగా, వీరిచ్చిన బంగారానికి ఒక్కో ఖాతాకు ఒక్కో బ్యాగు సిద్ధం చేస్తారు. ఈ బ్యాగుల్లో తొలుత 86 మాయమయ్యాయని అధికారులు గుర్తించగా, వీటిలో 26 బ్యాగులను అకౌంటెంట్ స్వప్నప్రియ మూడు రోజుల కిందట బ్యాంకు అధికారులకు అందించినట్టు తెలిసింది. మిగిలిన 60 బ్యాగుల వివరాలు ఆధారంగా 7 కేజీల బంగారం ఆభరణాలు మాయమయ్యాయమని నిర్ధారించారు. నవంబర్ 24వ తేదీన బంగారం మాయమైందన్న ఆరోపణలు రాగా ఇప్పటివరకు అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీ చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై ఆర్ఎం రాజును ప్రశ్నిస్తే సమాధానం దాట వేశారు.



ఫిర్యాదు చేస్తున్న స్టేట్‌బ్యాంకు ఆర్ఎం రాజు, బ్రాంచి మేనేజర్ రాధాకృష్ణ

క్లుప్తంగా

కుక్కల దాడిలో 20 గొర్రెపిల్లల మృతి

వంగర: మండల పరిధి మడ్డువలస గ్రామంలో కుక్కలు దాడిచేయడంతో 20 గొర్రెపిల్లలు మృతిచెందాయి. తాము నిద్రిస్తున్న సమయంలో బుధవారం అర్ధరాత్రి కుక్కలు గొర్రెల శాలలో చొరబడి దాడికిపాల్పడ్డాయని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు గ్రామానికి చెందిన గంటమాని సన్యాసి కోరుతున్నాడు.

తమ్ముడిపై అన్న దాడి



తలపై తగిలిన గాయంతో తమ్ముడు ప్రతాప్

వీరఘట్టం: అన్నదమ్ముల మధ్య వ్యాపార లావాదేవీలు చివరకు కొట్లాటకు దారితీశాయి. యాక్సా బ్లేడ్ కట్టర్‌తో తమ్ముడిపై అన్న దాడిచేయడంతో తలపై గాయాలై తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో క్షతగాత్రుడు పోలీసులను ఆశ్రయించగా పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయించి ఎస్సై ఎం.వి.రమణ కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. వీరఘట్టం మండల కేంద్రానికి చెందిన భోగి నాగేశ్వరరావు కుమారులైన శ్రీనివాసరావు, ప్రతాప్‌లకు కొన్నేళ్లుగా ఆస్తి తగాదాలున్నాయి.ఒకే ఇంటిలో నివాసం ఉంటున్న వారి మధ్య తరచూ వాగ్వాదం జరుగుతూనే ఉంది. గతంలో వీరు పోలీసులను ఆశ్రయించగా సర్దిచెప్పడంతో పాటు బైండోవర్ కేసులు కూడా నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.గురువారం వీరి మధ్య జరిగిన వాగ్వాదం కొట్లాటకు దారి తీసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

9 పశువుల వాహనాలు సీజ్

బొబ్బిలి: ఒడిశా సరిహద్దుతో పాటు పార్వతీపురం,కురుపాం, కూనేరు ప్రాంతాల నుంచి పశువులను తరలిస్తున్న 9 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక అంతర్రాష్ట్ర రహదారిలో కాపు కాసిన పోలీసులు వాహనాల్లో పశువులు తరలిస్తున్నట్లు గుర్తించి నిలుపుదల చేశారు. అలా ఒక దాని వెంట ఒకటిగా మొత్తం 9వాహనాలను సీజ్ చేశారు. వాహనాల్లో మొత్తం 86 పశువులు ఉన్నాయని ఎస్సై చదలవాడ సత్యనారాయణ, ఏఎస్సై బీవీ రమణలు ఈ సందర్భంగా తెలిపారు. వాహనాల్లో కిక్కిరిసి ఉంచి వాటికి ఏ విధమైన నీరు, ఆహారం లేకుండా తరలిస్తున్నారన్నారు. ఈ వాహనాలన్నింటినీ సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అబ్దుల్ హమీద్ తదితరులు

గజపతినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధికి పెద్ద పీట వేసిందని ఆయనకు ముస్లిం సోదరుల తరఫున అభినందనలు తెలియజేస్తున్నట్లు ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ అన్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం గజపతినగరంలోని మసీదులో ముస్లిం సోదరులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో దూసుకుపోతున్న అభివృద్ధిని ముస్లిం సోదరులకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ముస్లిం సోదరులు, మైనారిటీలకు జగన్ మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా తెలియజేసేందుకు ఆయన ఆవిష్కరించారు.

ప్రొఫెసర్ శాంతమ్మకు ఇస్పా అవార్డు బహూకరణ



ప్రొఫెసర్ శాంతమ్మకు ఇస్పా అవార్డు అందజేస్తున్న సెంచూరియన్ సిబ్బంది

నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఎమిరేటస్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న చిలుకూరి శాంతమ్మకు చెన్నైకి చెందిన ఇండియన్ స్పెక్ట్రో ఫిజిక్స్ అసోసియేషన్(ఇస్పా) అవార్డును బహూకరించింది. ఈ మేరకు గురువారం విశ్వవిద్యాలయంలో ఇస్పా ఫౌండర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎస్.గుణశేఖరన్, చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు ఈ అవార్డును ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడే తత్వంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకుంటే వృద్ధిలోకి రాగలరని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్ గుణశేఖర్, ఫిజిక్స్ విభాగాధిపతి విజయ్‌బాబు, ఐక్యూఏసీ డీన్ ప్రొఫెసర్ రమణారావు,డీన్ డాక్టర్ సన్నీడయోల్, డాక్టర్ దేవికారాణి పాల్గొన్నారు.

ఉన్న ఊరిలోనే విద్యుత్ సేవలు

- ట్రాన్స్‌కో వినియోగదారులకు వారధిగా ఎనర్జీ అసిస్టెంట్లు
- ఉమ్మడి జిల్లాలో 500 మంది నియామకం

రామభద్రపురం: రాష్ట్రప్రభుత్వం వినియోగదారులకు విద్యుత్ సేవలు మరింత చేరువ చేసింది. గ్రామ సచివాలయాల్లో విద్యుత్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటి వరకు విద్యుత్ బిల్లుల చెల్లింపుతో పాటు పలు విద్యుత్ సేవలు పొందేందుకు వినియోగదారులు విద్యుత్ సబ్‌స్టేషన్లు, సెక్షన్ ఆఫీసులు, మీ సేవ కేంద్రాలకు వెళ్లేవారు. ఈ కష్టాలను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లో 14 రకాల విద్యుత్ సేవలు పొందేలా చర్యలు చేపట్టింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో సుమారు 780 సచివాలయాలు ఉన్నాయి. వివిధ విద్యుత్ సమస్యలపై విద్యుత్ సబ్‌స్టేషన్లు, మీసేవ కేంద్రాల చుట్టూ తిరగకుండా గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా సేవలు మరింత అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రామభద్రపురం సచివాలయం-2 కార్యాలయం

విద్యుత్ కష్టాలకు రాం..రాం..

గతంలో పలు రకాల విద్యుత్ సేవలను పొందేందుకు వినియోగదారులు అష్టకష్టాలు పడేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సేవలను గ్రామ సచివాలయాల ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చింది.పట్టణ ప్రాంతాల్లో 13 రకాల విద్యుత్ సేవలతో పాటు పల్లెల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపు కూడా 14 సేవగా గ్రామ సచివాలయాలకు అనుసంధానం చేసింది. వినియోగదారులు, విద్యుత్ సంస్థకు మధ్య వారధిగా ఎనర్జీ అసిస్టెంట్లు (గ్రేడ్ 2 జేఎల్ఎం) కీలకపాత్ర పోషిస్తున్నారు.పట్టణాలు,గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు.ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రభుత్వం నియమించిన సుమారు 500 మంది ఎనర్జీ అసిస్టెంట్లు వినియోగదారులకు సేవలందిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లకు కొన్ని విద్యుత్ సర్వీసులకు సంబంధించి బాధ్యతలు అప్పగించారు. వారు వినియోగదారులకు నిత్యం అందుబాటులో ఉంటూ 5-10 కి.మీ.దూరంలో ఉన్న విద్యుత్ లైన్లు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, విద్యుత్ జంపర్లు తెగిన సమయంలో వాటిని పునరుద్ధరించడం, ట్రాన్స్‌ఫార్మర్లలో తలెత్తిన సమస్యలు పరిష్కరించడం, ఆగిపోయిన, కాలిపోయిన మీటర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం తదితర సేవలందిస్తున్నారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలపై వినియోగదారులు, వలంటీర్లు సచివాలయాల్లో ఫిర్యాదు చేస్తే అతి తక్కువ వ్యవధిలో సమస్యను గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.



రామభద్రపురం విద్యుత్ సబ్‌స్టేషన్

గ్రామాల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపు శుభపరిణామం



రాష్ట్రప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా విద్యుత్ సేవలను అందుబాటులోకి తెచ్చింది.గతంలో విద్యుత్‌కు సంబంధించి ఏ సమస్య వచ్చినా కరెంట్ ఆఫీసు చుట్టూ తిరగాల్సి వచ్చేది.ఆ సమస్య లేకుండా గ్రామ సచివాలయాల్లోనే 14 రకాల సేవలు అందుతుండడం శుభపరిణామం.

పూడి సత్యనారాయణ, వినియోగదారు, రామభద్రపురం

సేవలను వినియోగించుకోండి..

గ్రామ సచివాలయాల్లో అందుతున్న 14 రకాల విద్యుత్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి.గృహ,వ్యవసాయ విద్యుత్ మీటర్లు, విద్యుత్ బిల్లులు, ఇతర విద్యుత్ సమస్యలపై ఫిరాదు చేస్తే ఎనర్జీ అసిస్టెంట్లు త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. విద్యుత్ సిబ్బంది ఎవరైన స్పందించకపోతే టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేస్తే వెంటనే సమస్య పరిష్కారమవుతుంది.

పోల శశిభూషణరావు, విద్యుత్‌శాఖ ఏఈ, రామభద్రపురం

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



విజయనగరం క్రైమ్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు గురువారం తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు కేంద్రాస్పత్రి వద్దకు వచ్చి అక్కడ గుర్తు తెలియని వ్యక్తి పడిపోవడంతో వెంటనే స్థానికులు ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు చెప్పారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, బంధువులెవరైనా గుర్తిస్తే తమను సంప్రదించాలని కోరారు.

బైక్‌ను లారీ ఢీకొని వ్యక్తి..

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల రహదారిపై గురువారం బైక్‌ను లారీ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనపై పార్వతీపురం రూరల్ ఎస్సై దినకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలంలోని ఉల్లిభద్ర గ్రామానికి చెందిన పి.గణపతి రావు (56) కిరాణా వ్యాపారి. సరుకులు కొనేందుకు ఉల్లిభద్ర నుంచి పార్వతీపురం పట్టణానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా అడ్డాపుశీల శివాలయం ఆర్చివద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో గణపతిరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహానికి పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు

విజయనగరం క్రైమ్/జామి: హత్యాయత్నం కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష, రూ.6వేలు జరిమానా విధిస్తూ 5వ ఏడీజే కోర్టు ఎస్.పద్మావతి గురువారం తీర్పు వెల్లడించినట్లు జామి ఎస్సై జి.వీరబాబు తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. జామి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జామి గ్రామంలో ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న శంబంగి మంగను భర్త వెంకటరామ్ ప్రసాద్ అనుమానిస్తూ శారీరకంగా వేధిస్తూ ఆమెను హత్యచేయాలనే ఉద్దేశంతో, ఆమె నివసిస్తున్న ఇంటికి నిప్పుపెట్టి కాల్చివేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు 2022లో ఎస్సై వీరబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరారోపణలు రుజువు కావడంతో ముద్దాయికి పై విధంగా శిక్ష విధిస్తూ నాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరువాడ రవీంద్రనాథ్ వాదనలు వినిపించారు.

మూగవేదనపై అప్రమత్తం

- చలి, మంచుతో తప్పని ఇబ్బందులు
- ఈ సీజన్‌లో రోగాలు ఎక్కువ
- సకాలంలో టీకాలు వేయించాలి
- పశువైద్యాధికారుల సూచన



శ్రీనివాసరావు, ఎ.డి., పశువైద్యశాఖ

సీతంపేట: మన్యంలో చలికితోడు మంచు విపరీతంగా కురుస్తుంది. ఈ తరుణంలో మూగ జీవాలకు వివిధ రకాల రోగాలు వచ్చే ఆస్కారముంది. ఈ నేపథ్యంలో మూగజీవాలకు తగిన రక్షణ చర్యలు చేపడితే ఫలితం ఉంటుందని పశు వైద్యులు తెలియజేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గొర్రెలు 8,15,213, మేకలు 4,25,609 ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. మొత్తం 12,40,822 జీవాలను పెంచుతున్నారు. మూగజీవాలకు సకాలంలో టీకాలు వేయిస్తే మంచిఫలితం ఉంటుందని పశుసంవర్ధక శాఖ ఎ.డి శ్రీనివాసరావు, దోనుబాయి పశువైద్యాధికారి రాజాం శంకరరావులు తెలిపారు.



టీకాలు వేస్తున్న సిబ్బంది

పశువుల్లో వచ్చే వ్యాధులు, నివారణ

1.పీపీఆర్ వ్యాధి : దీన్ని పుర్రురోగం లేదా చీడి పారుడు వ్యాధి అని కూడా అంటారు. జనవరి నుంచి ఆగస్టు మధ్యలో ఈ వ్యాధి వస్తుంది. పారోమక్సో జాతికి చెందిన వైరస్ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

లక్షణాలు..

- అధిక జ్వరం (106-108 డిగ్రీలు) ఉంటుంది
- పలుచటి నలుపు రంగు విరోచనాలవుతాయి
- నాలుక, పెదవులు, నోటిపై పొక్కులు ఏర్పడతాయి. • దగ్గు, రక్తంతో కూడిన చీమిడి, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది

చికిత్స..

- యాంటీబయాటిక్ ఇంజక్షన్లు 3-5 రోజులు వాడాలి. 1 శాతం పొటాషియం పెర్మాంగనేట్ ద్రావణంలో నోటి పుండ్లు శుభ్రపరిచి బోరో గ్లిసరిన్ పేస్ట్ అప్లై చేయాలి. మరోనెక్స్ ఇంజక్షన్లు 3-5 రోజులు వాడాలి. • 3 నెలలు దాటిన గొర్రెలకు వ్యాధి నివారణ టీకా వేయాలి

2. మసూచి

- బొబ్బ, అమ్మతల్లి, అమ్మోరు అని అంటారు. వైరస్ వల్ల కలుషితమైన మేత, నీరు, గాలి ద్వారా ఈ వ్యాధి సోకుతుంది.

లక్షణాలు

- జ్వరం 106 డిగ్రీల నుంచి 108 డిగ్రీల వరకు ఉంటుంది. • తొడ, తోక కింద భాగాల్లో, పెదవులు, కనురెప్పలు, జననేంద్రియాలలో పొక్కులు ఏర్పడతాయి. • నోటినుంచి చొంగ, ముక్కు నుంచి చీమిడి కారుతుంది. • కళ్ల నుంచి నీరు, ముక్కు నుంచి చీము కారుతుంది. శ్వాస కష్టమవుతుంది. • చూడి జీవాలు ఈడుసుకుని పోతాయి.

చికిత్స

- బొబ్బకు హిమాక్స్, వేపనూనె పూయాలి. యాంటీ హిస్టమైన్ ఇంజక్షన్లు 3-5 రోజులు చేయాలి.

3. గాలికుంటువ్యాధి

- నోటిగాళ్లు, కాళ్లగాళ్లు అని అంటారు.

లక్షణాలు..

- జ్వరం • చొంగ • నోటిలో, కాలిగిట్టల మధ్య పుండ్లు • మేత మేయకపోవడం, కుంటుట ఉంటాయి

చికిత్స..

- యాంటీ బయాటిక్స్ 3-5 రోజులు వాడాలి. 1 శాతం పొటాషియం పెర్మాంగనేట్ ద్రావణంతో పుండ్లను శుభ్రం చేసి నోటిపుండ్లకు బోరోగ్లిజరిన్, కాలిపుండ్లకు జింక్ ఆయింట్‌మెంట్ పూయాలి.

4. మూతిపుండ్ల వ్యాధి (కంటేజియస్ ఎగ్జిమా)..

- వైరస్ ద్వారా చలికాలంలో ఎక్కువగా సోకుతుంది.

లక్షణాలు

- ముక్కు రంధ్రాల చుట్టూ ఎర్రగా పొక్కులు ఏర్పడతాయి.
- పెదవులు కలిసే చోట ఎర్రగా మారి, నల్లటి పొక్కులు ఏర్పడతాయి

చికిత్స

- యాంటీబయాటిక్ 3-5 రోజులు వాడాలి. 2 శాతం బోరోగ్లిజరిన్ నోటికి పూయాలి

5. కంటేజియస్ కేప్రయిన్ ప్లూరో న్యుమోనియా..

- మైకోప్లాస్మా ద్వారా చలికాలంలో మేకల్లో ఈ వ్యాధి సోకుతుంది.

లక్షణాలు

- జ్వరం, నొప్పితో కూడిన పొడిదగ్గు, శ్వాస కష్టమవడం, చొంగ, ముక్కునుంచి స్రావాలు కారుతాయి

చికిత్స..

- యాంటీ బయాటిక్స్, యాంటీ హిస్టమైన్ ఇంజక్షన్ చేయాలి.

వచ్చే నెల 11, 12 తేదీల్లో కళా ఉత్సవ్ పోటీలు

- డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.తిరుపతి నాయుడు

నెల్లిమర్ల: వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో డిసెంబరు 11,12 తేదీల్లో జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుపతి నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య సంస్థలకు చెందిన అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 9, 10, 11, 12వ తరగతులు చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు. మొత్తం 10 కళారూపాలలో ద్విమితీయ, త్రిమితీయ చిత్రణ, సంప్రదాయ బద్ధ ఆటబొమ్మలు, ఆటలు, నాటకం (ఏక పాత్రాభినయం) విభాగాల్లో పోటీలు 11వ తేదీన నిర్వహిస్తామని చెప్పారు. గాత్ర సంగీతం(సంప్రదాయ, జానపద), వాద్య సంగీతం(పెర్కెసివ్-మెలోడిక్), నాట్యం(సంప్రదాయ-జానపద) విభాగాల పోటీలు 12వ తేదీన నిర్వహిస్తామన్నారు. ఒక విద్యాసంస్థ నుంచి ఒక్కో కళారూపంలో ఒక బాలుడు, ఒక బాలిక మాత్రమే (విడివిడిగా) పాల్గొనాలని స్పష్టం చేశారు. గత సంవత్సరం (2022) జరిగిన కళాఉత్సవ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థులు ఈ సంవత్సరం పాల్గొనేందుకు అనర్హులని చెప్పారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు వారికి అవసరమైన సామగ్రిని వారే తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి కళారూపానికి 5 నిమిషాల సమయం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు డైట్ కళాశాల బోధనా సిబ్బంది పి.రవికుమార్ ఫోన్ 7989350244 నంబర్, కె.సూర్యారావు ఫోన్ 9441684360 నంబర్లను వాట్సాప్ ద్వారా సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

అండర్-19 మహిళల క్రికెట్ జట్టు కొండపల్లి పయనం



అండర్-19 బాలికల క్రికెట్ పోటీలకు వెళ్తున్న జిల్లా జట్టు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 బాలికల స్కూల్‌గేమ్స్ క్రికెట్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా మహిళల జట్టు గురువారం పయనమైంది. డిసెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు విజయవాడలోని కొండపల్లిలో జరగనున్న పోటీల్లో 13 మంది క్రీడాకారిణుల టీమ్ జిల్లా తరఫున పాల్గొననుంది. అంతర్ జిల్లాల పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారిణులను అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు పీడీలు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- 51 మందికి ఉపకరణాల పంపిణీ



బ్యాటరీ ట్రై సైకిల్స్ పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: దివ్యాంగులు కూడా సమాజంలో అందరితో బాటు సమానంగా ఉండాలనే ప్రధాన లక్ష్యంతో ప్రభుత్వం వారి కోసం ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆలిమ్‌కో సంస్థ ద్వారా మండలంలోని 51 మంది దివ్యాంగులకు కేటాయించిన ఉపకరణాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగుల కోసమే ప్రభుత్వం ఆలిమ్‌కో సంస్థతో చర్చించి కోట్లాది రూపాయల విలువైన ఉపకరణాలను తెప్పించిందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, అధికార్ల శ్రీనుబాబు, చందక గురునాయుడు, రఘుమండ త్రినాథ్, దాలయ్య, ముజీర్ మహ్మద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.గిరిబాల, తహసీల్దార్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి మెగా కంప్లిషన్ డ్రైవ్

- ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి
- హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదీన్



మాట్లాడుతున్న హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదీన్

విజయనగరం అర్బన్: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద గృహ నిర్మాణాలు పూర్తి చేయడానికి డిసెంబర్ 1 నుంచి మెగా కంప్లిషన్ డ్రైవ్ నిర్వహించాలని హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదీన్ తెలిపారు. రాష్ట్రంలో ఈ అక్టోబర్‌లో 5.8 లక్షల గృహాలు పూర్తయి గృహ ప్రవేశాలు జరిగాయని, వచ్చే జనవరి లోపల మరో 5 లక్షల గృహాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా నిర్ణయించారని తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్ ఆడిటోరియంలో మెగా కంప్లిషన్ డ్రైవ్ పై మండల ప్రత్యేకాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, మండలాభివృద్ధి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మితో కలసి మండల వారీగా లక్ష్యాలపై సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేసి వచ్చే ఫిబ్రవరిలో సామూహిక గృహ ప్రవేశానికి సిద్ధం కావాలని కోరారు. వచ్చే 2 రోజుల్లో మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించాలని, డిసెంబర్ 10 లోపల సచివాలయ స్థాయిలో సమావేశం పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస రావు, హౌసింగ్ ఈఈలు, డీఈలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన



ధాన్యం కొనుగోలు విధి విధానాలపై బ్రోచర్లు పంపిణీ చేసిన ఏఓ

బాడంగి: ప్రభుత్వం రైతుల నుంచి ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని అందుకు ప్రతీ రైతు కొన్ని నియమ నిబంధనలు పాటించాలని ఏఓ కె.శిరీష అన్నారు. మండలంలోని రేజేరు గ్రామ రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు, రబీ రాగుల సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ధాన్యంలో మట్టి, వ్యర్థాలు, తేమ లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. జీపీఎస్ ఉన్న వాహనాలలోనే ధాన్యం మిల్లులకు రవాణా చేయాలని, ధాన్యం లోడింగ్ అయిన తరువాత తప్పనిసరిగా రైతు బయోమెట్రిక్ వేయాలని అప్పుడే ఎఫ్‌టీఓ పత్రం రైతుకు ఇవ్వడం జరుగుతుందన్నారు. వైస్ ఎంపీపీ బొమ్మినాయుని రమేష్, వీఏఏ సాయి కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వార్షికోత్సవం

రాజాం: పట్టణంలో అమ్మవారికాలనీ వద్ద శాఖా గ్రంథాలయ దశమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠకులకు వివిధ రకాల పాటలు, ఆటలు, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్ కుమార్, ఎంఈఓ యగాటి దుర్గారావు గ్రంథాలయాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ జిల్లా కార్యదర్శి బుర్రి కుమార్, గ్రంథాలయ అధికారి వై.అమర్నాథ్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, గ్రంథాలయ సిబ్బంది రమణమ్మ, డోలపేట బీడీసీ నిర్వాహకులు జగదీశ్వరరావు, మల్లికార్జునకాలనీ బీడీసీ నిర్వాహకులు రాము, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



ట్రైసైకిళ్లు అందుకున్న దివ్యాంగులతో శాసనమండలి విప్ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు

రాజాం: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన 124 మంది దివ్యాంగులకు శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు ఉపకరణాలు పంపిణీ చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, ఉపకరణాలను లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఈఓపీఆర్‌డీ వి. శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు యాలల వెంకటేష్, నక్క వర్షిణి, సర్పంచ్ వంజరాపు విజయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్లు చిన్నంనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.